సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 25 । జూలై । 2025



27 నుంచి చెస్ పోటీలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): చెస్ పోటీలను ఆది, సోమవారాల్లో నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు. రాయ్ చెస్ అకాడమీలో నిర్వహించనున్నామని వివరించారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.1,01,900
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,212
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,488
నవర (8 గ్రాములు)	రూ.75,904

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.5 /25.2

జిల్లాలో ఆకాశం శుక్రవారం మేఘావృతమై ఉంటుందని అధికారులు తెలిపారు. గాలిలో తేమ 65 శాతంగా గురువారం నమోదైంది.

న్యూస్‌రీల్

కాకాణికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్

నెల్లూరు (లీగల్): ప్రభుత్వ భూముల రికార్డులను తారుమారు చేశారంటూ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై వెంకటాచలం పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులో జ్యుడీషియల్ రిమాండ్‌ను ఆగస్టు ఏడు వరకు విధిస్తూ న్యాయమూర్తి శారదరెడ్డి గురువారం ఉత్తర్వులిచ్చారు. నెల్లూరు కేంద్ర కారాగారంలో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న కాకాణిని పీటీ వారెంట్‌పై వర్చువల్ విధానం ద్వారా నెల్లూరు అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టులో గుంటూరు సీఐడీ పోలీసులు ప్రవేశపెట్టారు. సీఐడీ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ లక్ష్మీనారాయణ.. కాకాణి పక్షాన సీనియర్ న్యాయవాదులు రామిరెడ్డి రోజారెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, విజయకుమారి, సిద్ధన సుబ్బారెడ్డి వాదనలు వినిపించారు. కేసులో ప్రాథమిక ఆధారాల్లేవని.. రాజకీయ కక్షతో ఉద్దేశపూర్వకంగా కాకాణిని 14వ నిందితుడిగా చేర్చారన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి శారదరెడ్డి ఆగస్టు ఏడు వరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు ఉత్తర్వులిచ్చారు.

బెయిల్ పిటిషన్ దాఖలు

మాజీ మంత్రి కాకాణిని విడుదల చేయాలని కోరుతూ బెయిల్ పిటిషన్‌ను న్యాయవాదులు రామిరెడ్డి రోజారెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, విజయకుమారి, సిద్ధన సుబ్బారెడ్డి గురువారం దాఖలు చేశారు.

బెల్టుషాపులున్న మాట వాస్తవమే

- ఎక్సైజ్ శాఖ డీసీ శంకరయ్య
- మద్యం షాపుల్లో తనిఖీలు



మద్యం దుకాణంలో అధికారుల తనిఖీలు

ఆత్మకూరు: ప్రధాన మద్యం దుకాణాలకు సమీపంలో, గ్రామాల్లో బెల్టు దుకాణాలున్న మాట వాస్తవమేనని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శంకరయ్య అంగీకరించారు. పట్టణ పరిధిలోని మద్యం దుకాణాలను ఎక్సైజ్ శాఖ రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అధికారి సుధాకర్‌రెడ్డితో పాటు పలువురు జిల్లా అధికారులు ఆకస్మికంగా గురువారం తనిఖీ చేశారు. ఆరు వైన్ షాపులను పరిశీలించి వాటిలోని సరుకు, బిల్లులను సరిచూశారు. ఇతర రాష్ట్రాల మద్యం ఉందాననే అంశాన్ని పరిశీలించారు. లైసెన్స్‌లిచ్చిన ప్రాంతంలోనే దుకాణాలను ఏర్పాటు చేశారాననే అంశాన్ని ఆరాతీశారు. రెండు దుకాణాల్లో శాంపిళ్లను తనిఖీ చేశారు. అనంతరం ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బెల్టు దుకాణాల విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. ఆత్మకూరు పరిధిలో 32 బెల్టు దుకాణాలను గుర్తించి 32 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని బెల్టు దుకాణాలపై దాడులు చేసేందుకు తగినంత మంది సిబ్బంది లేరని వివరించారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం రాకుండా కట్టడి చేస్తున్నామని వెల్లడించారు. ఏసీ దయాసాగర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులునాయుడు, ఏఈఎస్ రమేష్, ఆత్మకూరు సీఐ వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వయోజన విద్య నోడల్ ఆఫీసర్‌గా మస్తాన్‌రెడ్డి



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న మస్తాన్‌రెడ్డి

నెల్లూరు (టౌన్): వయోజన విద్య జిల్లా నోడల్ ఆఫీసర్‌గా మల్లు మస్తాన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు అడల్ట్ ఎడ్యుకేషన్ జేడీ ప్రతాప్‌రెడ్డి ఉత్తర్వులను జారీ చేశారు. కాగా కలెక్టరేట్లో కలెక్టర్ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా ఆయన గురువారం కలిసి మొక్కను అందజేశారు.

న్యాయవాదుల నిరసన నేడు

నెల్లూరు(లీగల్): జిల్లా కోర్టు ఆవరణలో నిరసనను శుక్రవారం ఉదయం చేపట్టనున్నామని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) శాఖ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ అరిగెల నాగేంద్రసాయి, జిల్లా అధ్యక్షుడు అబ్బాయిరెడ్డి, జనరల్ సెక్రటరీ బ్రహ్మం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో చేపట్టనున్న కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఇంజినీరుగారి..



- కళాశాలల యాజమాన్యాల ఆశలు ఆవిరి
- ముగిసిన తొలి విడత కౌన్సెలింగ్
- జిల్లాలో ఈ ఏడాది 66 శాతం సీట్లే భర్తీ
- గతేడాదితో పోలిస్తే 11 శాతం పతనం
- పొరుగు రాష్ట్రాలవైపే మొగ్గు
- ఆశలన్నీ రెండో విడతపైనే

ఇంజినీరింగ్.. ఈ కోర్సు అంటేనే క్రేజ్. దీన్ని అభ్యసించి సాఫ్ట్‌వేర్ రంగంలో కొలువుదీరి.. ఇతర దేశాల్లో స్థిరపడాలనే కోరిక గతంలో బలంగా ఉండేది. అయితే ప్రస్తుతం ఈ ఊపు లేకపోవడం.. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో పరిస్థితి అయోమయంగా మారింది. ఫలితంగా కళాశాలల్లో సీట్ల భర్తీ కోసం యాజమాన్యాలు నానా అగచాట్లు పడాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతోంది. జిల్లాలో ఇంజినీరింగ్ కాలేజీలు గతంలో 24 ఉండగా, ప్రస్తుతం ఈ సంఖ్య 13కు పతనమైందంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. గత విద్యా సంవత్సరంలో 77 శాతం సీట్లు భర్తీ కాగా, ఈ ఏడాది 11 శాతం క్షీణించి 66 శాతానికే పరిమితమైంది.

నెల్లూరు (టౌన్): జిల్లాలోని ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సీట్ల భర్తీ కోసం నానా తంటాలు పడుతున్నారు. ఆశించిన స్థాయిలో భర్తీ కాకపోవడం.. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో కాలేజీలే మూతపడుతున్న పరిస్థితి నెలకొంది. జిల్లాలో గతంలో 24 ఇంజినీరింగ్ కళాశాలలుండగా, ప్రస్తుతం ఇది 13కే పరిమితమైంది.

నూరు శాతం భర్తీ.. మిథ్యే

గత విద్యా సంవత్సరంలో 77 శాతం సీట్లు భర్తీ కాగా, ఈ ఏడాది 11 శాతం పతనమైంది. జిల్లాలోని ఏ కాలేజీలోనూ నూరు శాతం భర్తీ కాలేదు. రెండు కళాశాలల్లో పది శాతంలోపు, మరో మూడు చోట్ల 39 శాతంలోపే భర్తీ కావడంతో ఏమి చేయాలో పాలుపోక యాజమాన్యాలు తలలు పట్టుకుంటున్నాయి. పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే రానున్న రోజుల్లో మరిన్ని మూతపడే ప్రమాదం పొంచి ఉంది.

మారిన పరిస్థితి

బ్రాంచ్‌తో సంబంధం లేకుండా ఇంజినీరింగ్ కళాశాలలో సీటు దొరికితే చాలనే భావన గతంలో ఉండేది. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి మారిపోయింది. తొలి విడత కౌన్సెలింగ్ బుధవారంతో ముగియగా, ఈ విషయాలు స్పష్టమయ్యాయి. జిల్లాలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో వివిధ బ్రాంచ్‌లలో 9715 సీట్లుండగా, 6409 మాత్రమే భర్తీ అయ్యాయి. ఎక్కడా నూరు శాతం భర్తీ కాకపోవడం గమనార్హం.

భర్తీ అయింది ఇలా..

నారాయణ (నెల్లూరు)లో 98.68.. నారాయణ (గూడూరు)లో 97.98.. ఏఈసీఎస్‌లో 94.91.. ఎన్బీకేఆర్‌లో 92.93.. జీటీఎన్నెన్‌లో 88.15.. ఏఎస్ఈటీలో 71.71.. ఆరెస్సార్ఎస్‌లో 70.51.. విశ్వోదయలో 67.39.. ఎస్వీసీఎస్‌లో 38.64.. డీఎస్సైటీలో 28.09.. జీకేసీఎస్‌లో 26.85.. పీఐఎస్నెన్‌లో 6.25.. పీఆర్ఐకేలో 4.69 శాతం సీట్లే భర్తీ అయ్యాయి.

కొన్ని కోర్సులకే డిమాండ్

ఇంజినీరింగ్‌లో సీఎస్ఈ, ఈసీఈ, మెకానికల్, సివిల్, ఏఐఎమ్మెల్, సీఎస్డీ, సీఎస్సీ, ఈసీఏ, ట్రిపుల్ ఈ, ఏఐ, ఐఎన్నెఫ్ తదితర కోర్సులున్నాయి. అయితే సీఎస్ఈ, ఈసీఈ, ఏఐఎమ్మెల్ కోర్సులకే డిమాండ్ ఎక్కువగా ఉంది.

కోర్సు	సీట్లు	భర్తీ అయినవి
సీఎస్ఈ	3972	2672
ఈసీఈ	1632	1132
ఏఐఎం / ఏఐఎమ్మెల్	1296	985
సీసీ / ఏఐడీ	768	607
ఏఐ / సీఏఐ	715	581
సివిల్	228	98
సీఎస్డీ	216	32
సీసీ / ఏఐడీ	768	607
ట్రిపుల్ ఈ	372	177
ఐఎన్నెఫ్ / డీఎస్ / సీఎస్ఓ	192	12
మెకానికల్	276	113
ఈవీటీ	48	00

పక్క రాష్ట్రాలకే సై..

ఇంజినీరింగ్‌ను అభ్యసించేందుకు తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, గుజరాత్ తదితర రాష్ట్రాలవైపు జిల్లా విద్యార్థులు అడుగులేస్తున్నారు. జిల్లాలోని కాలేజీల్లో వసతుల లేమి.. క్వాలిఫైడ్ అధ్యాపకుల్లేకపోవడం.. నాణ్యమైన బోధన అందకపోవడం.. కౌన్సెలింగ్ ప్రక్రియ ఆలస్యం కావడం సైతం దీనికి కారణమని తెలుస్తోంది. ఇప్పటికే ఎక్కువ మంది పొరుగు రాష్ట్రాల్లోని కాలేజీల్లో ప్రవేశాలు పొందారు. మరోవైపు ఇటీవలి కాలంలో సాఫ్ట్‌వేర్ రంగం గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఉద్యోగాలూ అంతంతమాత్రంగానే ఉన్నాయి. నాణ్యత గల కళాశాలల నుంచి వచ్చిన వారికే కంపెనీలు అవకాశమిస్తుండటం సైతం దీనికి కేంద్రబిందువవుతోంది.

నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటేనే ఉద్యోగాలు



ఇంజినీరింగ్ విద్యలో నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటేనే విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. సీఎస్ఈ, ఏఐ, ఏఐఎమ్మెల్ కోర్సులతో పాటు మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్ రంగాల్లో ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉన్నాయి. రానున్న రోజుల్లో సాఫ్ట్‌వేర్ రంగం పుంజుకుంటుంది. విదేశీ భాషలను నేర్చుకుంటే ఇతర దేశాల్లో ఉద్యోగాలు లభిస్తాయి. – కుమార్, డీన్, అడ్మినిస్ట్రేషన్, గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాల

ప్రభుత్వంపై ప్రజా తిరుగుబాటు తప్పదు



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి, చిత్రంలో కిలివేటి, ఆనం విజయకుమార్‌రెడ్డి, పూజిత తదితరులు

- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై అక్రమ కేసులను మోపుతున్న కూటమి ప్రభుత్వంపై ప్రజా తిరుగుబాటు తప్పదని పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని మాజీ ఎమ్మెల్యే, పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి కిలివేటి సంజీవయ్య, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. జెడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా, మంత్రిగా అనేక పదవుల్లో పనిచేసి మంచి నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై అక్రమ కేసులను మోపి అరెస్ట్ చేయడంతో జిల్లా ప్రజలు విస్తుపోయారని చెప్పారు. కక్ష సాధింపు చర్యల్లో భాగంగా మద్యం కేసంటూ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని తాజాగా అరెస్ట్ చేశారని ఆరోపించారు. హామీలను అమలు చేయని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న నేతలను లక్ష్యంగా చేసుకొని అరెస్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. మైనింగ్ కేసులో పార్టీ నేత బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేసి ఆయన్ను బెదిరించి బలవంతపు స్టేట్‌మెంట్ తీసుకొని మాజీ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ పేరును చేర్చారని ధ్వజమెత్తారు. కూటమి నేతలిచ్చిన స్క్రిప్టును అమలు చేస్తూ.. ప్రేక్షకపాత్రకే పోలీసులు పరిమితమయ్యారని విమర్శించారు. కూటమి ప్రభుత్వ పాలన ఎమర్జెన్సీని తలపిస్తోందన్నారు. ప్రజలకు ఆదాయ వనరులు తగ్గిపోయి.. వ్యాపారాలు సాగక ఇబ్బంది పడుతుంటే.. ప్రభుత్వం మాత్రం పీ4 విధానమంటూ కల్లబొల్లి కబుర్లు చెప్తోందని ఎద్దేవా చేశారు. 2014, 2019లో తమ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని జైలుకు పంపేందుకు చంద్రబాబు విశ్వప్రయత్నాలు చేశారని ఆరోపించారు. ప్రజాక్షేత్రంలో జగన్‌మోహన్‌రెడ్డిని అడ్డుకోలేక ఇలాంటి కుటిల రాజకీయాలను అవలంబిస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో మద్యం విక్రయాలను తగ్గించాలనే లక్ష్యంతో మెరుగైన మద్యం పాలసీని తమ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చారని వివరించారు. ఇందులో అక్రమాలు జరిగాయంటూ తమ పార్టీకి చెందిన 38 మంది నేతలపై కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. అక్రమ కేసులు బనాయించిన వారికి పార్టీ అండగా ఉంటూ.. చట్టపరంగా పోరాడతామని భరోసా ఇచ్చారు.

అరాచక పాలన

ఎల్లో మీడియాను అడ్డం పెట్టుకొని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలనను సాగిస్తోందని కిలివేటి సంజీవయ్య ఆరోపించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించి జైల్లో పెడుతున్నారని మండిపడ్డారు. డిస్టిలరీలను ఏర్పాటు చేసి.. మద్యం బ్రాండ్లు తీసుకొచ్చింది చంద్రబాబు కాదానని ప్రశ్నించారు. హామీలను అమలు చేసే విషయంలో కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి కరువైందని విమర్శించారు. గుర్తుతెలియని వ్యక్తుల దాడి కారణంగానే మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి నివాసం ధ్వంసమైందంటూ కేసు నమోదు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

పరిపాలనను గాలికొదిలారు..

పరిపాలనను టీడీపీ గాలికొదిలిందని ఆనం విజయకుమార్‌రెడ్డి మండిపడ్డారు. తమ పార్టీ నేతలపై ఏదో ఒక కేసు పెట్టి విచారణ పేరిట పిలిచి వారిని అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. కాకాణిపై కేసులు పెట్టి వేధించడం దారుణమని చెప్పారు. అసలు ఏమి సాధించాలని టీడీపీ ఇలా వ్యవహరిస్తోందో అర్థం కావడంలేదని తెలిపారు.

పరిశ్రమల ఏర్పాటుతో జిల్లా అభివృద్ధి




మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(అర్బన్): పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగి.. జిల్లా అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. కలెక్టరేట్లో గురువారం నిర్వహించిన పరిశ్రమలు – ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమల స్థాపన కోసం సింగిల్ డెస్క్ పోర్టల్లో 1700 దరఖాస్తులు రాగా, 1616ను ఆమోదించగా, 20 అప్లికేషన్లను తిరస్కరించామని వివరించారు. పెండింగ్‌లో ఉన్న వాటికి సంబంధించి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, లీగల్ మెట్రాలజీ అధికారులు తమ శాఖ పరిధిలోని అంశాలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. మెగా ప్రాజెక్టుల ద్వారా 13,599 మందికి, పెద్ద పరిశ్రమల ద్వారా 7,557 మందికి ఉద్యోగాలను కల్పించామని వెల్లడించారు. జాన్సన్ ఇన్‌ఫ్రా, ఉత్కర్ష అల్యూమినియం, క్రిబ్కో గ్రీన్ ఎనర్జీ, విశ్వసముద్ర బయో ఎనర్జీ తదితర కంపెనీలు త్వరగా ఏర్పాటయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జేసీ కార్తీక్, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం మారుతిప్రసాద్, ఏపీఐఐసీ జెడ్ఎం శివకుమార్, ఆర్డీఓలు పావని, అనూష, వంశీకృష్ణ, పరిశ్రమలు – ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సభ్యుడు భక్తవత్సలం తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని 15 సూత్రాల అమలుపై సమీక్ష

ఆర్థికంగా వెనుకబడిన ముస్లిం మైనార్టీలకు 15 శాతానికి తగ్గకుండా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. ప్రధానమంత్రి 15 సూత్రాల కార్యక్రమ అమలుపై కలెక్టరేట్లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గృహ నిర్మాణ, ఉపాధి హామీ, విద్య, సామాజిక పింఛన్లు, వైద్యం, మత్స్య సంపద యోజన, రుణాల మంజూరు తదితరాలను మైనార్టీలకు చేరువ చేయాలని సూచించారు. నెల్లూరు రూరల్ మండల పరిధిలోని అక్కచెరువుపాడులో ముస్లిం మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల భవనాలను పూర్తి చేయాలని కోరారు. ముస్లిం మైనార్టీ జిల్లా సంక్షేమాధికారి హైఫా, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, డీఈఓ బాలాజీరావు, డ్వామా పీడీ గంగాభవాని, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య, ఏడీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ, పరిశ్రమల శాఖ జీఎం మారుతిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సోమశిలకు కృష్ణమ్మ పరుగులు



- 8928 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

సోమశిల: జిల్లా జలనిధి సోమశిల జలాశయానికి కృష్ణమ్మ పరుగులు తీస్తోంది. బుధవారం సాయంత్రానికి 545 క్యూసెక్కుల ప్రవాహం నమోదు కాగా, గురువారం ఉదయానికి ఇది 8928 క్యూసెక్కులకు పెరిగింది. వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఆరో క్రస్ట్ గేట్ నుంచి డెల్టాకు విడుదల చేస్తున్న నీటిని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిలిపామని, వాహనాలు శివాలయం మీదుగా వెళ్లొచ్చన్నారు. జలాశయంలో 27.88 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పవర్ టన్నెల్ ద్వారా పెన్నార్ డెల్టాకు 1600, ఉత్తర కాలువకు 320 క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని జలాశయ ఈఈ శ్రీనివాసులు తెలిపారు.

క్లుప్తంగా

బస్సు చక్రాల కింద నలిగిన ప్రాణం


మృతదేహం

నెల్లూరు(క్రైమ్): ఆర్టీసీ బస్సు చక్రాల కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. ఓ వ్యక్తి బుధవారం రాత్రి మినీబైపాస్‌లోని మిలీనియం సబ్‌స్టేషన్ వద్ద ఉన్నాడు. ఆత్మకూరు బస్టాండ్ వైపు నుంచి వచ్చిన బస్సు యూటర్న్ తీసుకునే క్రమంలో అతడిని ఢీకొనడంతో కిందపడ్డాడు. వెనుక చక్రం నడుముపైకి ఎక్కడంతో తీవ్రగాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందాడు. సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్ పోలీసులు హాస్పిటల్‌కు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి మార్చురీకి తరలించారు. మృతుడి వయసు 50 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉండొచ్చని భావిస్తున్నారు. వివరాలు తెలిసిన వారు సమాచారం తెలియజేయాలని కోరారు.

సమ్మె విరమించాలని బెదిరింపులు

- మహిళను దూషించిన నలుగురు వ్యక్తులు
- ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): సమ్మె విరమించాలని పబ్లిక్ హెల్త్ వర్కర్‌ను బెదిరించి, కులంపేరుతో దూషించి దాడిచేసిన వారిపై నెల్లూరు చిన్నబజారు పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. కోటమిట్టలో ఎం.మయూరి కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో పబ్లిక్ హెల్త్ వర్కర్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 22వ తేదీన ఆమె తన ఇంటి నుంచి కార్మికుల సమ్మెలో పాల్గొనేందుకు బయలుదేరారు. పుత్తా ఎస్టేట్ ఆర్చి సమీపంలో ఆమెను గోపీ, నవీన్, భాస్కర్, రాజేష్ అడ్డుకుని సమ్మె విరమించాలని బెదిరింపు చర్యలకు దిగారు. ఆమె వినకపోవడంతో కోపోద్రిక్తులైన వారు కులంపేరుతో దూషించి దాడి చేశారు. అంతటితో ఆగకుండా సమ్మెలో కనిపిస్తే అక్రమ కేసులు పెట్టి పనులు లేకుండా చేస్తామని బెదిరించి వెళ్లిపోయారు. బాధితురాలు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితులపై గురువారం ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు.

బస్సు అపహరణ కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): బస్సు అపహరణ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి కథనం మేరకు.. నెల్లూరు ఆత్మకూరు బస్టాండ్ పాయింట్‌లో ఉన్న ఆత్మకూరు డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సును బుధవారం తెల్లవారుజామున విడవలూరు మండలం కంచరపాళేనికి చెందిన బిట్రగుంట కృష్ణ అపహరించాడు. ఆత్మకూరు డిపో మేనేజర్ శివకేశవ యాదవ్ ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. బుధవారం అర్ధరాత్రి నిందితుడిని అరెస్ట్ చేసి గురువారం కోర్టులో హాజరుపరిచామని పోలీసులు తెలిపారు. కొంతకాలంగా నిందితుడికి మతిస్థిమితం బాగోలేనట్లు వెల్లడించారు.

నిమ్మ చెట్లు తొలగించి భూమి ఆక్రమణ

- నిందితులపై చర్యలు తీసుకోవాలని ఆందోళన

కలువాయి(సైదాపురం): గిరిజనుల భూముల్లోని నిమ్మ చెట్లను తొలగించిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరు పెంచలయ్య డిమాండ్ చేశారు. నిమ్మ చెట్ల తొలగింపును నిరసిస్తూ గురువారం కలువాయి తహసీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనులతో కలిసి ఆందోళన చేశారు. పెంచలయ్య మాట్లాడుతూ మండలంలోని బాలాజీరావుపేటకు చెందిన ఇండ్ల పెద వెంకయ్యతోపాటు వారి కుటుంబ సభ్యులకు ఇచ్చిన డీ–పట్టా భూమిలో సాగు చేసుకుంటున్న నిమ్మ చెట్లను అదే గ్రామానికి చెందిన సిద్ది వెంకటేశ్వర్లు కొందరితో తొలగించి పక్కనే ఉన్న బావిలో పడేశారని, బోరును సైతం ధ్వంసం చేసి భూమిని ఆక్రమించారని ఆరోపించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శ్యామ్‌సుందర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

మైనింగ్ ఆపండి.. ప్రాణాలు కాపాడండి

గ్రామసభలో సబ్ కలెక్టర్‌కు మొర

- కనికరించని అధికారులు
- మైనింగ్‌కు పచ్చజెండా
- విలపిస్తున్న పల్లె జనం

ఉదయగిరి/వరికుంటపాడు: 'గ్రామంలో మైనింగ్ చేపట్టి మా పొట్ట కొట్టొద్దు. జీవనాధారమైన గుట్టను స్వాహా చేసి ప్రాణాలు తీయకండి. తాతముత్తాతల నుంచి ఈ గుట్టను (కొండ) ఆసరా చేసుకుని పశువులు, జీవాలు మేపుతూ జీవనం సాగిస్తున్నాం. ఇప్పుడు మాకు తెలియకుండానే ఎక్కడి నుంచో వచ్చి మైనింగ్ చేసుకుంటామంటున్నారు. మేమెలా బతకాలి? ఎక్కడికి వెళ్లాలి? మా ప్రాణాలు తీసి మైనింగ్ చేయండి' అంటూ జనం కన్నీరుమున్నీరుగా విలపిస్తూ కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ ఎదుట వాపోయారు. అయినా అధికారులు వారి మొర ఆలకించలేదు. మైనింగ్ యాజమానులు తమ పనులు చేసుకునేందుకు పచ్చజెండా ఊపారు. జనం గట్టిగా వాదనలు వినిపించే వీలు లేకుండా భారీ సంఖ్యలో పోలీసులను ప్రయోగించారు. ఈ మైనింగ్ మాఫియా వెనుక అధికార పార్టీకి చెందిన ముఖ్య నేత హస్తం ఉండటంతో అధికార యంత్రాంగం తలొగ్గింది. దీంతో పేద దళితులు నిస్సహాయస్థితిలో ఉండిపోయారు. ఈ దృశ్యాలు వరికుంటపాడు మండలం జంగంరెడ్డిపల్లిలో మైనింగ్ క్వారీ కోసం గురువారం జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ గ్రామసభలో కనిపించాయి.


మైనింగ్ ఆపాలంటూ తమ గోడు సబ్ కలెక్టర్‌కు వినిపిస్తున్న జనం


సభలో గ్రామస్తులను అడ్డుకుంటున్న పోలీసులు

ఎక్కడంటే..

వరికుంటపాడు మండలం భాస్కరపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 233 – 1లో 16.7 హెక్టార్లలో క్వార్ట్జ్, మైకా ఖనిజ సంపద కోసం నిర్వహించిన టెండర్‌ను ఓ కాంట్రాక్టర్ కైవసం చేసుకున్నారు. గతేడాది డిసెంబర్‌లో కొండలో మైనింగ్ చేసేందుకు ప్రయత్నంగా గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో అధికారులు ప్రజలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కానీ వారు ఇక్కడ క్వార్ట్జ్ తీస్తే మా జీవనాధారం పోతుందని ఏకతాటిపై నిలిచి పనులు ఆపించారు. దీంతో గత్యంతరం లేక మైనింగ్‌దారుడు వెళ్లిపోయారు.

అధికార పార్టీ అండతో..

అధికార పార్టీ బలం లేనిదే ఇక్కడ మైనింగ్ చేయలేమని గ్రహించిన కాంట్రాక్టర్ స్థానికంగా ఉన్న నేతలు, నియోజకవర్గ ముఖ్య నాయకుడి సహకారం తీసుకున్నారు. దీంతో రంగంలోకి దిగిన అధికార పార్టీ నేతలు గ్రామస్తుల్లో కొంతమందికి ఎర వేశారు. నయానో.. భయానో తమ దారికి తెచ్చుకున్నారు. గ్రాజ జనంలో చీలికలు తెచ్చారు. ప్రజాభిప్రాయ సేకరణ సభకు ముఖ్యమైన వ్యక్తులు డుమ్మా కొట్టేలా ప్లాన్ చేశారు. సభకు వచ్చిన కొద్ది మంది మైనింగ్ ఆపాలని వేడుకున్నారు. పేదల గోడు విన్నా సబ్ కలెక్టర్ మాత్రం మైనింగ్ వెలికితీతకు పచ్చజెండా ఊపారు. దీంతో గ్రామస్తులు ఒక్కసారిగా సబ్ కలెక్టర్‌ను చుట్టుముట్టి తమకు అన్యాయం చేయొద్దని వేడుకున్నారు. కానీ పోలీసులు వారిని పక్కకు పంపి సబ్ కలెక్టర్‌ను సాగనంపారు. ఈ వ్యవహారం విజయవంతం చేయడంలో సహకరించిన అధికారులకు మైనింగ్ యజమాని తరఫున రాజమర్యాదలు జరిగాయనే ఆరోపణలున్నాయి. సభలో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారి అశోక్, తహసీల్దార్ పి.హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది లేక ఇబ్బంది

- మంత్రి ఇలాకాలో వైద్యశాలకు తాళాలు

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని ప్రభుత్వ వైద్యశాలలో తగినంతమంది సిబ్బంది లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ 24 గంటలు వైద్యసేవలు అందించాల్సి ఉండగా ఆ పరిస్థితి లేదు. ఇద్దరు వైద్యులున్నా సాయంత్రం 4 గంటల తర్వాత వారి గ్రామాలకు వెళ్లిపోతారు. వాచ్‌మెన్ తాళాలు వేసి వెళ్లిపోతున్నారు. మరుసటిరోజు ఉదయం 9 గంటలకు తిరిగి ప్రారంభిస్తారు. గతంలో ఇద్దరు స్టాఫ్‌నర్సులు ఉండగా వివిధ కారణాలతో వారిని ప్రభుత్వం ఇతర ప్రాంతాలకు బదిలీ చేసింది. ప్రస్తుతం ఒక స్టాఫ్ నర్సు పగలు విధులు నిర్వహిస్తోంది. ఇక్కడి దర్గాకు ఇతర ప్రాంతాల నుంచి ఎంతోమంది భక్తులు వస్తుంటారు. ఆరోగ్యం బాగాలేకుంటే ఈ వైద్యశాలను ఆశ్రయిస్తుంటారు. సాయంత్రం నాలుగు గంటల తర్వాత తాళాలు వేస్తుండటంతో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఇంతటి దారుణ పరిస్థితులున్నాయి.


మూసివేసిన వైద్యశాల

సిబ్బంది లేని మాట వాస్తవం

రాత్రి వేళల్లో డ్యూటీలు నిర్వహించేందుకు తగినంత మంది లేకపోవడంతో వైద్యశాలకు తాళాలు వేయాల్సి వస్తోంది. ఈ విషయం జిల్లా అధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లాం.
– గోపీనాథ్, డ్రాయింగ్ ఆఫీసర్

మున్సిపల్ కార్మికుల భారీ ర్యాలీ


ర్యాలీ చేస్తున్న మున్సిపల్ కార్మికులు, నేతలు

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థలో పారిశుద్ధ్య పనులను ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు 9వ డివిజన్లో పిలిచిన టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో గురువారం కార్మికులు భారీ ర్యాలీ చేశారు. నెల్లూరులోని గాంధీ బొమ్మ వద్ద నుంచి వీఆర్సీ సెంటర్ వరకు ఇది జరిగింది. ఈ సందర్భంగా ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ నియోజకవర్గంలో టెండర్లు పిలవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు నాగభూషణం, జ్యోతిబసు, కత్తి శ్రీనివాసులు, కొండా ప్రసాద్, కె.పెంచల నరసయ్య, జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి

- కేసు నమోదు చేసిన పోలీసులు

నెల్లూరు(క్రైమ్): తాను చెప్పినట్లు వినవా అంటూ ఓ మహిళపై దాడి చేసిన ఘటనలో నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. నెల్లూరు రామకోటయ్యనగర్‌కు చెందిన ఓ మహిళకు గూడూరుకు చెందిన వ్యక్తితో వివాహమైంది. వారు ఆ ఊరిలోనే కాపురం ఉన్నారు. భర్త రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. ఈక్రమంలోనే ఆమెకు గూడూరుకు చెందిన నవీన్‌తో పరిచయమైంది. అతని ప్రవర్తన బాగాలేకపోవడంతో ఆమె గూడూరు నుంచి రామకోటయ్యనగర్ లోని తల్లి వద్దకు వచ్చింది. రెండునెలల క్రితం నవీన్ ఆమె వద్దకెళ్లి చిల్లకూరు మండలంలో రోడ్డు పనులు జరుగుతున్నాయని, అక్కడ కూలీలకు వంట చేసేందుకు రావాలని, బాగా చూసుకుంటానని నమ్మించి తీసుకెళ్లాడు. అతని ప్రవర్తనలో మార్పు లేకపోవడంతో ఆమె తిరిగి తల్లి వద్దకు వచ్చేసింది. ఈనెల 22వ తేదీన నవీన్ ఆమె వద్దకు వచ్చాడు. తాను చెప్పినట్లు వినవా అంటూ బీరు బాటిల్, కర్రతో దాడిచేశాడు. మహిళ తల్లి, చుట్టుపక్కల వారు అడ్డుకోవడంతో నిందితుడు పరారయ్యాడు. బాధితురాలు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు విచారిస్తున్నట్లు పోలీసులు గురువారం తెలిపారు.

మనీస్కామ్ కేసును నీరుగార్చారు

- ఎమ్మెల్యేకు రూ.90 కోట్లు, డీఎస్పీ, సీఐకు రూ.5 కోట్ల చొప్పున ముడుపులు
- పేదలకు న్యాయం చేయడంలో పోలీస్ యంత్రాంగం విఫలం
- నష్టపోయిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటాం
- కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి(జలదంకి): కావలి ముసునూరులో అనంతపద్మనాభ అసోసియేషన్ పేరిట మనీస్కామ్ సూత్రధారి సుభానీ పన్నిన వలలో వేలాది మంది ఉద్యోగులతోపాటు పేదలు మోసపోయారని, కేసును పోలీస్ యంత్రాంగం నీరుగార్చి అన్యాయం చేసిందని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. పట్టణంలోని తన నివాసంలో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. ఈ స్కామ్‌లో కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి, డీఎస్పీ, రూరల్ సీఐలు రూ.100 కోట్ల మేర వాటాలు పంచుకున్నారనే విషయం తెలిసిందన్నారు. దగదర్తిలో రెండు రోజుల క్రితం నిర్వహించిన సమావేశంలో మనీస్కామ్ ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో రూ.800 కోట్ల మేర జరిగిందని, ఇందులో ఎమ్మెల్యే పాత్రను ప్రస్తావించానని చెప్పారు. అనంతరం తాను బెంగళూరు వెళ్లానని, అయితే తాను పారిపోయానని, దాక్కున్నానని, మద్యం కేసులో అరెస్ట్ అంటూ ఎమ్మెల్యే అనుచర మీడియా ట్రోల్స్ చేశారని విమర్శించారు. కావలిలో ఎమ్మెల్యే ద్వారా ఉద్యోగం తెచ్చుకున్న రాధాకృష్ణ అనే కానిస్టేబుల్ తోపాటు 17 మంది డైరెక్టర్లుగా ఏర్పడి వారు మరికొందరికి ట్రైనింగ్ ఇచ్చి రూ.లక్షకు రోజుకు ఆరు శాతం నగదు ఇస్తామంటూ భారీగా కట్టించుకున్నారని ఆరోపించారు.

రూ.35 కోట్లేనా?

మొదట్లో అలాగే నగదు అందించడంతో పోలీస్, రెవెన్యూ, విద్యుత్ తదితర ఉద్యోగులతోపాటు కింది స్థాయి ఉద్యోగులు, అలాగే ఏజెంట్ల మాటలు నమ్మి ఎంతోమంది పేదలు ఆస్తులు, బంగారాన్ని తాకట్టు పెట్టి కట్టారని వివరించారు. కావలి నియోజకవర్గంలోనే దాదాపు రూ.400 కోట్ల నుంచి రూ.500 కోట్ల మేర నగదును చెల్లించారని వివిధ పత్రికలు, చానళ్లలో వార్తలొచ్చాయని తెలిపారు. పేదలందరికీ న్యాయం చేస్తానంటూ ఆ సమయంలో ఎమ్మెల్యే ఊదరగొట్టారని చెప్పారు. సుభానీని పదిరోజులపాటు తూతూమంత్రంగా విచారించి తెలంగాణలోనూ స్కామ్ జరిగిందంటూ అక్కడికి తరలించారన్నారు. తాము నష్టపోయామని బాధితులు తెలిపేందుకు యత్నిస్తే కావలి డీఎస్పీ, సీఐలు వారిని భయపెట్టి విషయాన్ని బయటకు రానీయకుండా చేశారని ఆరోపించారు. రూ.35 కోట్ల మేర స్కామ్ జరిగిందని, అందులో రూ.15 కోట్లను రికవరీ చేశామంటూ కేసును తప్పుదోవ పట్టించి ఎంతోమంది పేదలకు అన్యాయం చేశారన్నారు. ఒక్క పోలీస్ డిపార్ట్‌మెంట్లోనే 71 మంది రూ.కోట్లు కట్టి మోసపోయి బయటకు చెప్పకుండా బాధను అనుభవిస్తున్నారన్నారు. కానిస్టేబుల్ రమేష్ రూ.లక్షలు కట్టి ఏమీ చేయలేక ఆత్మహత్యకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఈ విషయమై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు. తనపై, నేతలపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా బయపడేది లేదని, అవినీతిని ఎండగడతామని స్పష్టం చేశారు. దగదర్తిలో మనీస్కామ్‌పై మాట్లాడిన తనను సీఐ రాజేశ్వరరావు బెదిరించారని, వీటికి భయపడేదిలేదని తేల్చిచెప్పారు. ఆయన్ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. స్కామ్‌పై సీబీఐతో విచారణ జరపాలన్నారు. బాధితుల కోసం టోల్‌ఫ్రీ నంబర్‌ను త్వరలో ఏర్పాటు చేసి వారు నష్టపోయిన వివరాలను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. కావలి, కావలి రూరల్, బోగోలు, అల్లూరు, దగదర్తి మండలాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్లు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, వాయిల తిరుపతి, మద్దిబోయిన వీరరఘు, బీద రమేష్‌బాబు, వెలినేని మహేష్‌నాయుడు, జెడ్పీటీసీ జంపాని రాఘవులు, నేతలు కనమర్లపూడి వెంకటనారాయణ, పందింటి కామరాజు, గంధం ప్రసన్నాంజనేయులు, కుందుర్తి కామయ్య తదితరులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 134
లేయర్ (లైవ్)	: 112
బ్రాయిలర్ చికెన్	: 240
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 264
లేయర్ చికెన్	: 190

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.27
సన్నవి	: రూ.15
పండ్లు	: రూ.5

రిజిస్ట్రేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

నెల్లూరు సిటీ: రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ వీరపాండ్యన్ గురువారం అన్ని జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నెల్లూరులోని ప్రధాన కార్యాలయం నుంచి జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, రిజిస్ట్రార్లు విజయరాణి, సింహాద్రినాయుడు, స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రార్ సుమలతారెడ్డి, బుజబుజనెల్లూరు సబ రిజిస్ట్రార్ ప్రవీణదేవీ, ఇందుకూరుపేట సబ్ రిజిస్ట్రార్ భానుమతిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ ఈనెల 28వ తేదీ నుంచి ప్రభుత్వం అర్బన్ ఆటో మ్యూటేషన్ విధానాన్ని ప్రారంభంకానున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీల్లో భూ యజమానులు అసెస్‌మెంట్ నంబర్ కోసం మున్సిపల్ ఆఫీసుల్లో ధరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లోనే ప్రక్రియ జరుగనున్నట్లు వెల్లడించారు. పట్టణ ప్రాంతాల్లో కూడా మున్సిపాలిటీలకు రావాల్సిన పన్నులు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఆటోమేటిక్ విధానం ద్వారా జరుగుతాయన్నారు. సబ్ రిజిస్ట్రార్లు తమ ప్రాంతాల్లో త్వరితగతిన అసెస్‌మెంట్ చేయాలని ఆదేశించారు.


కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు